కొనసాగుతున్న బోనాల సందడి

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవాలయం వద్ద ఆషాడ బోనాల ఉత్సవాల కోలాహలం కొనసాగుతోంది. ఆది, సోమవారాల్లో అమ్మవారి బోనాలు, రంగం కార్యక్రమాలు ఘనంగా జరిగిన విషయమే. అయితే ఆషాఢమాసం కావడంతో దేవాలయం వద్ద మంగళవారం కూడా భక్త జనందోహం కనిపించింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద ఎత్తున బారులుతీరారు. అమ్మవారికి బోనం, సాక, తొట్టెలు సమర్పించేందుకు అధిక సంఖ్యలో వచ్చారు.

సీఎం వైఖరి వల్లే నిధులు దక్కలేదు

ఉస్మానియా యూనివర్సిటీ: సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం, బీజేపీ పట్ల అవలంబిస్తున్న మెతక వైఖరి వల్లే రాష్ట్రానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి బీజేపీతో అంటకాగుతూ రాష్ట్రం నుంచి 8 ఎంపీ సీట్లు గెలిచేందుకు పరోక్షంగా సహకరించారని తుంగబాలు ఆరోపించారు. అలాగే రాష్ట్రానికి నిధులు తేలేని కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పెన్షనర్ల సంక్షేమమే ధ్యేయం


సమావేశంలో మాట్లాడుతున్న శంకర్‌రావు

అడ్డగుట్ట: ఆలిండియా రైల్వే పెన్షనర్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ సికింద్రాబాద్ డివిజన్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సికింద్రాబాద్‌లోని మజ్దూర్ యూనియన్ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ శంకర్‌రావు మాట్లాడుతూ రైల్వే పెన్షనర్ల సంక్షేమమే ధ్యేయంగా, వారి హక్కుల సాధనే లక్ష్యంగా పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ పని చేస్తోందని పేర్కొన్నారు. పెన్షనర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ భాస్కర్ మజ్దూర్ యూనియన్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ అందజేత


ఎల్‌ఓసీ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్

సనత్‌నగర్: జెక్‌కాలనీకి చెందిన హేమలత వైద్యం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన ఆర్థిక సహాయ పత్రాన్ని (ఎల్‌ఓసీ) సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అందజేశారు. హేమలత గత కొంతకాలంగా లుకేమియా వ్యాధితో బాధపడుతోంది. స్థానిక కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను ఆశ్రయించి సహాయం కోరారు. శ్రీనివాస్‌యాదవ్ చొరవతో రూ.2.25 లక్షల ఆర్థిక సహాయం మంజూరు కాగా మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద హేమలత సోదరుడు సుభాష్‌కు అందజేశారు. కార్పొరేటర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, అమీర్‌పేట మాజీ కార్పొరేటర్ ఎన్.శేషుకుమారి, నాయకులు కొలను బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం


తలసానికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న కార్పొరేటర్

సనత్‌నగర్: శ్రీహనుమాన్ దేవస్థానంలో ఈ నెల 28న జరిగే బోనాల ఉత్సవాలకు హాజరుకావాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు మంగళవారం ఆహ్వానపత్రికను అందజేశారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, దేవస్థానం ఈఓ శ్రీనివాసరాజు, ప్రధాన అర్చకులు పరుశురాం రవీంద్రాచార్యులు, గోపాల్‌జోషి తదితరులు వెస్ట్‌మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి బోనాల ఉత్సవాలకు ఆహ్వానించారు.

'తక్షశిల' విద్యార్థుల సందడి



లాలాపేట: తార్నాక డివిజన్ శాంతినగర్‌లోని తక్షశిలా పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మంగళవారం చోటీ సి ఆశ పేరుతో సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. 5,6,8 తరగతులకు చెందిన పలువురు విద్యార్థులు మాతృ ఫౌండేషన్ అంధ బాలల ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడి పిల్లలతో పాటా, పాటలతో సందడిగా దినమంతా గడిపారు.

ప్రజా సమస్యలపై ఉద్యమించాలి


మాజీ ఎమ్మెల్సీ రామ్‌చందర్‌రావుతో తార్నాక డివిజన్ బీజేపీ ముఖ్య నేతలు

లాలాపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమ కార్యాచరణ రూపొందించాలనీ మాజీ ఎమ్మెల్సీ ఎన్ రామ్‌చందర్‌రావు అన్నారు. మంగళవారం తార్నాక డివిజన్ బీజేపీ అధ్యక్షుడు రాము వర్మ ఆధ్వర్యంలో డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ నెల 25న నిర్వహించతలపెట్టిన డివిజన్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంపై చర్చించారు. డివిజన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యచరణపై పలువురు నేతలు మాట్లాడారు. కార్యక్రమంలో వెంకటేష్‌గౌడ్, పోచయ్య యాదవ్, గణేష్ ముదిరాజ్, ఉపేందర్ యాదవ్ పాల్గొన్నారు.

స్కూలుకు దారేదీ?



- పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గంలేక ఇక్కట్లు
- ఇబ్బంది పడుతున్న దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు

చిలకలగూడ : విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని ప్రభుత్వం చెప్పుకుంటున్నా క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. అందుకు నిదర్శనమే మెట్టుగూడ డివిజన్ దూద్‌బావి ప్రభుత్వ పాఠశాల దుస్థితి. పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోవడంతో విద్యార్థుల సంఖ్య రోజురోజుకూ తగ్గిపోతుందని అధ్యాపక సిబ్బంది వాపోతున్నారు.

మురికివాడల్లో విద్య అందించేందుకు...

మురికివాడలు, బస్తీలకు చెందిన చిన్నారులకు విద్యను అందించేందుకు 2003లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను దూద్‌బావి బస్తీలో ఏర్పాటు చేశారు. దూద్‌బావి, చింతబావి, చిలకలగూడ, పాండవబస్తీ, మైలార్‌గడ్డ, దాతర్ కాంపౌండ్ తదితర ప్రాంతాలకు చెందిన వందలాది మంది చిన్నారులు పాఠశాలలో చేరారు. పదేళ్ల క్రితం చిలకలగూడ రైల్వే అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాఠశాలను దూద్‌బావి పాఠశాలలో విలీనం చేశారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మూడు భాషల్లో వందలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

దారి మూసివేతతో సమస్య ఉత్పన్నం

దూద్‌బావి పాఠశాలకు వెళ్లేందుకు మైలార్‌గడ్డ నుంచి 40 అడుగుల రహదారి ఉండేది. దూద్‌బావి బస్తీ నుంచి కాలిబాట మరోమార్గం. సుమారు పదేళ్ల క్రితం మైలార్‌గడ్డ వైపు ఉన్న మార్గాన్ని మూసివేశారు. అప్పటి ప్రభుత్వంలో పలుకుబడి ఉన్న ఓ అధికారి పాఠశాలకు వెళ్లే మార్గానికి అడ్డుగా గోడకట్టి కారు షెడ్‌ను నిర్మించుకున్నాడు. అధ్యాపకులు, విద్యార్థుల తల్లి తండ్రులు ఆందోళన చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో దూద్‌బావి బస్తీనుంచి సన్నటి కాలిబాటనే ఉపయోగించుకుంటున్నారు. మురికి కాలువలోనుంచే విద్యార్థులు, అధ్యాపకులు రాకపోకలు సాగించడం గమనార్హం. పాఠశాల ప్రాంగణంలోని ఓ గదిలో అంగన్‌వాడీ సెంటర్ కొనసాగుతుంది. మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ సెంటర్‌కు సరుకులు తెచ్చేందుకు వాహనాలు వచ్చే అవకాశం లేకపోవడంతో సుమారు 300 మీటర్ల దూరం నుంచి సరుకులను భుజాన ఎత్తుకుని తీసుకువచ్చే దుస్థితి నెలకొంది. పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేకపోతే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉండదని, మైలార్‌గడ్డ వైపు మూసివేసిన మార్గాన్ని అందుబాటులోకి తేవాలని విద్యార్థుల తల్లితండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

మైలార్‌గడ్డ రహదారి అందుబాటులోకి తేవాలి



దూద్‌బావి పాఠశాల అధ్యాపకులు బాగా చదువు చెబుతున్నారు. అయితే పాఠశాలకు వెళ్లేందుకు సరైన మార్గం లేదు. బస్తీలోని సన్నటి కాలిబాట ద్వారా మురుగులో నడుచుకుంటు వెళ్లాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుంది. అధికారుల స్పందించి మైలార్‌గడ్డ రహదారిని అందుబాటులోకి తేవాలి.

– రేఖ, విద్యార్థి తల్లి

ఇలా అయితే ఆందోళన చేస్తాం



దూద్‌బావి పాఠశాల సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రం అందించినా స్పందన లేకపోవడం దురదృష్టం. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు పాఠశాలను సందర్శించి వాస్తవ పరిస్థితులు తెలుసుకోవాలి. సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన చేస్తాం.

– కాంపల్లి శ్రీనివాస్, సీపీఐ సికింద్రాబాద్ కార్యదర్శి

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



దూద్‌బావి పాఠశాలలో నెలకొన్న సమస్యలను సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాము. ప్రస్తుతం ఐదు తరగతుల్లో 79 మంది విద్యార్థులు ఉన్నారు. డ్రైనేజీ సమస్య ఉంది. ప్రజావాణిలో కూడా విజ్ఞప్తి చేశాం. సరైన మార్గం లేకపోవడంతో చిన్నారులను స్కూలుకు పంపించేందుకు తల్లి తండ్రులు విముఖత వ్యక్తం చేస్తున్నారు.

– మల్లిఖార్జునరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

బోనాల ఏర్పాట్లపై డీసీ సమీక్ష


సమీక్ష సమావేశంలో పాల్గొన్న డిప్యూటీ కమిషనర్, కార్పొరేటర్

చిలకలగూడ : ఈనెల 28, 29 తేదీలలో జరిగే బోనాల జాతరలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ డీసీ సుభాష్, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమలు సూచించారు. నామాలగుండు వార్డు కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులు, సిబ్బందితో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు. ఆలయ పరిసరాల్లో విద్యుత్ దీపాలు, మొబైల్ ట్రాన్స్‌ఫార్మర్లు, బారికేడ్లు ఏర్పాటు, రహదారులపై గుంతలు పూడ్చాలని, జాతర జరిగే మూడు రోజులు నిరంతరం మంచినీరు సరఫరా, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, పారిశుధ్య పర్యవేక్షణ, వాటర్ ప్యాకెట్లు ఉచిత పంపిణీ, ప్రత్యేక అంబులెన్స్‌లు, ఫైర్‌ఇంజన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ సంధ్య, మెడికల్ ఆఫీసర్ రజనీకాంత్, డీఈఈ సువర్ణ, జలమండలి సెక్షన్ మేనేజర్లు అన్విత్, ప్రియాంక, ఏఈ కౌశిక్ పలు విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మా సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించండి

'కూనంనేని'కి పార్ట్‌టైం టీచర్ల వినతి


సాంబశివరావుకు వినతి పత్రం ఇస్తున్న పార్ట్‌టైం టీచర్లు

లాలాపేట: రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్‌టైం టీచర్లందరినీ అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్టుగా అప్‌గ్రేడ్ చేయాలనే అంశాన్ని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని మంగళవారం తెలంగాణ ఆల్ యూనివర్సిటీస్ పార్ట్‌టైం టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధి బృందం సీపీఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావును కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. గత ప్రభుత్వానికి తమ సమస్యను పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. కనీసం ప్రస్తుత ప్రజాపాలనలో అయినా యూనివర్సిటీల్లో పని చేస్తున్న పార్ట్‌టైం టీచర్లకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డా. సోమేశ్వర్, కార్యనిర్వాహక అధ్యక్షులు డా. జానకిరెడ్డి పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ- ఏలోకి మార్చాలి


సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్

బన్సీలాల్‌పేట్: తెలంగాణలో ముదిరాజ్ కులస్తులను బీసీ–డీ నుంచి ఏ గ్రూప్‌లోకి మార్చాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ విజ్ఞప్తి చేసింది. సికింద్రాబాద్ బోయిగూడ ముదిరాజ్ సంఘంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ముదిరాజ్ లకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేస్తామన్నారు. వివిధ జిల్లాలకు చెందిన ముదిరాజ్ మహాసభ నాయకులు సదానంద్, జగదీశ్వర్, ఎం.శ్రీనివాస్, వెంకటేష్, శ్రీకాంత్, సురేందర్, నీలం శ్రీనివాస్, శారద తదితరులు పాల్గొన్నారు.

సాయన్న సేవలు మరువలేనివి


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: కంటోన్మెంట్ నియోజకవర్గానికి దివంగత ఎమ్మెల్యే సాయన్న కుటుంబం చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. సాయన్న కుమార్తె, దివంగత ఎమ్మెల్యే లాస్య నందిత అకాల మరణం చెందిన నేపథ్యంలో మంగళవారం శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాప తీర్మానం ప్రవేశపెట్టారు. కంటోన్మెంట్ ప్రజల్లో సాయన్న కుటుంబానికి శాశ్వత స్థానం ఉందన్నారు. సాయన్న మరణానంతరం గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో లాస్య నందిత ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, మూడు నెలల్లోపే రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం దురదృష్టకరమన్నారు. తాను ప్రస్తుతం ఎమ్మెల్యే కావడంలో దివంగత ఎమ్మెల్యే సాయన్నే స్ఫూర్తి అని పేర్కొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో (కిలోల్లో..) టమాటా రూ.45, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 28, పచ్చిమిర్చి 60, బజ్జీమిర్చి 48, క్యాప్సికమ్ 53, పచ్చకాకర 35, పందిరి బీర 28, క్యాబేజీ 25, క్యారెట్ 42, దొండ 28, గుండుబీన్స్ 60, గింజ చిక్కుడు 60, గోకరకాయ 28, కీర 21, దోసకాయ 15, బీట్‌రూట్ 28, ఉల్లిగడ్డ 34, ఆలుగడ్డ 40, చామగడ్డ 37, మొరంగడ్డ 40, కందగడ్డ 55, సొరకాయ 23, పొట్లకాయ 13, అరటికాయ 11, మునగకాయ 4–5, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు సంకటహర చతుర్థి

సనత్‌నగర్: సంకటహర చతుర్థి సందర్భంగా బుధవారం సనత్‌నగర్ శ్రీహనుమాన్ దేవస్థానంలోని గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 నుంచి పంచామృతాభిషేకం, అనంతరం ప్రత్యేక అలంకరణ దర్శనం హారతి, తీర్థ ప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు.

డ్రగ్స్ నివారణపై దృష్టి సారించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో కొన్ని ప్రముఖ కార్పొరేట్ విద్యా సంస్థలు డ్రగ్స్‌కు అడ్డాగా మారడం దురదృష్టకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం పేర్కొన్నారు. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలు, ఇంజినీరింగ్, ఇతర కోర్సుల కాలేజీలలో డ్రగ్స్ లభించడం దారుణమన్నారు. డ్రగ్స్‌తో అనారోగ్యంతో పాటు మానసిక, శారీరక ఎదుగుదల నిలిచిపోయి యువత భవిష్యత్తులో ఎందుకూ పనికిరాకుండ పోతారన్నారు. ఇప్పటికైనా ఈ విషయంపై దృష్టి సారించి చర్యలు తీసుకోవాలన్నారు.

లాల్‌బజార్ మహంకాళి ఆలయ బోనాలు ప్రారంభం



రసూల్‌పురా : మూడు రోజుల పాటు జరిగే తిరుమలగిరి లాల్‌బజార్ మహంకాళి ఆలయ బోనాల ఉత్సవం మంగళవారం ప్రారంభమయ్యాయి. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం నుంచి ఆలయ ఈవో లాల్‌బజార్ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకుని వచ్చి అందజేసిన అనంతరం ఘటోత్సవ ఎదుర్కోలుతో బోనాల జాతర ప్రారంభం కావడం శతబ్దాల నుంచి ఆనావాయితిగా వస్తోందని ఆలయ ఈవో సత్యచంద్రా రెడ్డి తెలిపారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మురళి ముదిరాజ్ పాల్గొన్నారు.

రైలు కిందపడి దివ్యాంగుడి ఆత్మహత్య

అడ్డగుట్ట: రైలు కిందపడి ఓ దివ్యాంగుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన మేరకు.. బొల్లారం రైల్వే స్టేషన్‌లోని ప్లాట్ ఫాం నెం. 2 బొల్లారం బజార్ సైడ్ ఎండ్ వద్ద సుమారు 40–45 ఏళ్ల మధ్య వయస్సు గల గుర్తు తెలియని దివ్యాంగుడు సోమవారం రాత్రి 10.30 గంటల సమయంలో జైపూర్ ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. కాగా, మృతుడు బ్లూ కలర్ షర్ట్, బ్లాక్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

విలీన వేళ సాయన్న లేకపాయె..

సీఎం రేవంత్ రెడ్డి

కంటోన్మెంట్: కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేయాలన్న దివంగత ఎమ్మెల్యే సాయన్న కల నెరవేరే వేళ ఆయన లేకపోవడం దురదృష్టకరమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నోట విలీనంపై మరోసారి స్పష్టమైన ప్రకటన రావడంతో కంటోన్మెంట్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కంటోన్మెంట్ ప్రాంతాన్ని జీహెచ్‌ఎంసీలో విలీనం చేసేందుకు ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు కేంద్రం సుముఖంగా ఉండటంతో త్వరలోనే విలీన ప్రక్రియ ప్రారంభం అవుతుందని పలువురు ఆశగా ఎదురు చూస్తున్నారు. మంగళవారం అసెంబ్లీలో దివంగత కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి పట్ల సంతాప తీర్మానం ప్రవేశపెట్టిన సందర్భంగా ముఖ్యమంత్రి పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతి, జీహెచ్‌ఎంసీలో విలీనానికి త్వరలోనే అనుమతులు రానున్న నేపథ్యంలో సాయన్న, ఆయన కుమార్తె జీవించి లేకపోవడం దురదృష్టకరం అన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధి కోసం పరితపించిన సాయన్న చేయలేకపోయిన అభివృద్ధి పనులను తమ ప్రభుత్వం పూర్తి చేస్తుందని ముఖ్యమంత్రి ప్రకటించారు. కంటోన్మెంట్ అభివృద్ధి పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఉన్నారని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. కంటోన్మెంట్ విలీనం, ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణంతో పాటు పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతాయన్నారు.

బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి


ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న బీజేపీ ఓబీసీ మోర్చా నాయకులు

రాంగోపాల్‌పేట్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా డిమాండ్ చేసింది. మంగళవారం మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దయానంద్, ఉపాధ్యక్షులు చీర శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో బీసీ డిక్లరేషన్‌పై కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా సికింద్రాబాద్ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు వాటిని పూర్తిగా విస్మరించిందని అన్నారు. రాష్ట్రంలో బీసీ డిక్లరేషన్ పేరుతో బీసీల ఓట్లతో లబ్ధిపొందారని కానీ బీసీలకు ఇప్పుడు వెన్నుపోటు పొడిచారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో అడ్మిన్ ఆఫీసర్ పాల్‌సింగ్‌కు వినతిపత్రం అందించారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు

సనత్‌నగర్: ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించినట్లుగా బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలంటూ బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర బీజేపీ ఓబీసీ మోర్చా పిలుపు మేరకు మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి సి.విజయ్ కుమార్, సనత్‌నగర్ నియోజకవర్గ ఓబీసీ మోర్చా కన్వీనర్ కన్నూరి చంద్రకుమార్‌ల ఆధ్వర్యంలో అమీర్‌పేట, సికింద్రాబాద్ మండల తహసీల్దార్లను కలిసి విన్నవించారు. జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు చీర శ్రీకాంత్, రాజశేఖర్‌రెడ్డి, దయానంద్, సలంద్రి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

టీపీటీ బకాయిలు విడుదల చేయాలి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బోర్డు సభ్యుడు రామకృష్ణ

కంటోన్మెంట్: కంటోన్మెంట్‌కు రావాల్సిన ట్రాన్స్‌ఫర్ ఆఫ్ ప్రాపర్టీ ట్యాక్స్ (టీపీటీ) నిధులను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ సకాలంలో టీపీటీ బకాయిలు విడుదల చేయకపోతే మరోసారి కోర్టును ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. గతంలో తాను కోర్టుకెళితేనే అప్పటి ప్రభుత్వం బకాయిలు విడుదల చేసిందని గుర్తుచేశారు. దీంతో నాటి బకాయిల్లో కొంతమేరకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం బకాయిల చెల్లింపుల్లో జాప్యం చేస్తూ ఉండటంతో మరోసారి బకాయిలు రూ.40 కోట్లకు చేరాయన్నారు. కోర్టుకు వెళితే తప్ప బకాయిలు చెల్లించ లేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. బకాయిలు చెల్లించాలని ఫైనాన్స్ సెక్రటరీతో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశానని పేర్కొన్నారు.

సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లండి

ఉస్మానియా యూనివర్సిటీ: పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల స్కాలర్ షిప్‌లు, పీహెచ్‌డీ స్కాలర్స్ ఫెలోషిప్‌ల అంశాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టి తీసుకువెళ్లాలని మంగళవారం ఎమ్మెల్యే వేముల వీరేశం, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్‌కు వినతి పత్రం సమర్పించారు. టీజీ రీసెర్చ్ స్కాలర్స్ అసోషియేషన్ కోఆర్డినేటర్ వలిగొండ నరసింహ ఆధ్వర్యంలో ఓయూ విద్యార్థి నేతలు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను కలిసి ఉపకార వేతనాల మంజూరులో జాప్యం గురించి చర్చించారు. యూనివర్సిటీ పరిశోధన విద్యార్థులకు నాన్ నెట్ ఫెలోషిప్‌లను మంజూరు చేసేల చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

వీరాంజనేయస్వామి ఆలయ ఛైర్మన్‌గా చందర్


చందర్

చిలకలగూడ : నామాలగుండు వీరాంజనేయస్వామి ఆలయ ఛైర్మన్‌గా చందర్‌తో పాటు నలుగురు ట్రస్ట్‌బోర్డు సభ్యులను నియమిస్తూ దేవదాయశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. నామాలగుండుకు చెందిన చందర్ సామాజిక కార్యకర్తగా పలు సేవలు అందిస్తున్నారు. నరేష్, చింతల హేమలత, నవీన్ కుమార్, అరుణ్‌కుమార్‌లను ఎక్స్‌అఫిషియో సభ్యులుగా, ఆలయ అర్చకులు పాలకుర్తి ప్రణవ్ కుమార్‌ను నియమించారు.

శాకంబరీదేవిగా బల్కంపేట ఎల్లమ్మ



అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ దేవాలయంలో శాకంబరి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆషాఢ మాసం 3వ మంగళవారం దాతలు సమకూర్చిన దాదాపు 30 క్వింటాళ్ల కూరగాయలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అంజనీదేవి తెలిపారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టిన అధికారులు

లాలాపేటలో పాడైన రోడ్లకు మరమ్మతు చేసిన దృశ్యం





సాక్షిలో ప్రచురితమైన కథనం

తార్నాక మున్సిపల్ డివిజన్ పరిధిలోని పలు రోడ్లు దెబ్బతిన్న వైనాన్ని ' రోడ్లు ఇలా..వెళ్లేదెలా ' అనే శీర్షికన మంగళవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. లాలాపేట, సత్యానగర్, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. – లాలాపేట